క్లుప్తంగా

తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలి



వీపనగండ్ల: మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో జూరాల, భీమా కాల్వల కింద వరి పంటలను సాగు చేసిన రైతులు నల్లి తెగుళ్లపై జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈవో అభిలాష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన వరి పంట పొలాలను పరిశీలించారు.

నేటి నుంచి వాలీబాల్ పోటీలు

వీపనగండ్ల: మండలంలోని దీపావళి పండుగ సందర్భాన్ని పురస్కరించుకొని సత్యశోధక్ సమతసమాజ్ వారి ఆధ్వర్యంలో తూముకుంట గ్రామంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నుంచి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మధుకర్, నాగరాజు, కర్ణాకర్ తెలిపారు. పోటీలో ప్రథమ బహుమతిని గెలుచుకున్న జట్టుకు రూ.15వేలు, రెండో బహుమతికి రూ.10 వేల నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేయనున్నట్లు వారు తెలిపారు. పోటీలో పాల్గొనాలకునే క్రీడాకారులు 9701212903, 9618060150కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలని వారు కోరారు.

ఇసుక డంపులు సీజ్



వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని రాంపురం గ్రామంలో ఇసుకడంపులు ఉన్నాయని సమాచారం మేరకు శనివారం తహసీల్దార్ మురళి గౌడ్ గ్రామంలో 12 ట్రాక్టర్ల ఇసుక డంపులను గుర్తించి సీజ్‌చేశారు. అను మతులు లేకుండా క్వారీ నుంచి ఇసుకను తరలించడం కాని డంపులు చేయడం, రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వారివెంట ఆర్ఐ రాఘవేంద్ర రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై కాంగ్రెస్ కపట ప్రేమ

అమరచింత: బీసీ రిజర్వేషన్ అమలుతీరుపై కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలపై కపటప్రేమను కనబర్చుతున్నదని బీజేపీ నారాయణపేట జిల్లా ఉపాధ్యక్షుడు మేర్వరాజు, మండల అధ్యక్షురాలు మంగలావణ్య అన్నారు. బీసీ రిజర్వేషన్‌కు మద్దతుగా బీజేపీ ఆధ్వర్యంలో శనివారం బంద్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వ తప్పేమి లేకున్న రాష్ట్రంలోని వామపక్షాల పార్టీలతో పాటు అధికార కాంగ్రెస్ పార్టీ బీజేపీని నిందించడం ఎంత వరకు సమంజసమన్నారు. మతపరమైన రిజర్వేషన్లకు మాత్రమే బీజేపీ వ్యతిరేకించిందని బీసీ రిజర్వేషన్‌కు కాదనే విషయాన్ని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో వినోద్, మల్లారెడ్డి, భాస్కర్, వెంకటేష్, నారాయణ, శ్రీనివాస్ యాదవ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఇంటిపై పడ్డ పిడుగు..



వీపనగండ్ల: మండలకేంద్రంలో శుక్రవారం రాత్రి భారీ మెరుపువర్షంతో కూడిన బత్తుల బాలస్వామి ఇంటిపై పిడుగు పడడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఆర్‌సీసీ మిద్దె కావడం పిడుగు పడిన సమయంలో ఇంట్లోనే మరోచోట కుటుంబసభ్యులు ఉండడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. గ్రామంలో పలువురు టీవీలు, కంప్యూటర్లు కాలిపోవడంతో తీవ్రంగా నష్టం వాటిల్లింది.

క్రీడాసామగ్రి అందజేత



ఆత్మకూర్: రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్య కమిషనర్ కృష్ణ ఆదిత్య ఆధ్వర్యంలో క్రీడాసామగ్రి కొనుగోలుకు ప్రతి కళాశాలకూ రూ.10వేల చొప్పున మంజూరు చేసిన నిధుల నుంచి ఆత్మకూర్ జూనియర్ కళాశాలకు నిధులు కేటాయించారు. ప్రిన్సిపాల్ సైదులు క్రికెట్‌బ్యాట్‌లు, వాలీబాల్లు, క్యారం బోర్డ్స్, చెస్‌బోర్డ్స్, షటిల్ బ్యాట్స్ తదితర కొనుగోలు చేశారు. సామగ్రిని ఫిజికల్ డైరెక్టర్ ఎస్.రాఘవేందర్‌రావుకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. మంజూరు చేసిన నిధులు విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించడానికి ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు భాగ్యవర్ధన్ రెడ్డి, విశ్వేశ్వర్, సునీల్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.



వీపనగండ్లలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్, సీపీఎం నాయకులు



పాన్‌గల్‌లో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు



గోపాల్‌పేటలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు



మదనాపురంలో మూతపడిన దుకాణాలు

బంద్ విజయవంతం

- స్వచ్ఛందంగా షాపుల మూసివేత
- రిజర్వేషన్లకు మద్దతు తెలిపిన ప్రజలు
- నిర్మానుష్యంగా మార్కెట్‌లు..



కొత్తకోటలో బంద్‌ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

వనపర్తి విద్యావిభాగం: జిల్లాలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కావాలని బీసీ జేఏసీ పిలుపు మేరకు పలు పార్టీలు ప్రజా సంఘాలతో ఉదయం నాలుగు గంటలకు బస్ డిపో దగ్గరకి తరలివచ్చి బంద్‌లో పాల్గొన్నారు. బీసీ జేఏసీ, అఖిలపక్ష ఐక్యవేదిక, ప్రజా సంఘాలు, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, టీడీపీ, డీఎస్పీ, బీఎస్పీ పార్టీలో బీసీ బంద్‌లో పాల్గొనడంతోజిల్లాలో బంద్ ప్రశాంతంగా కొనసాగింది.

వీపనగండ్ల: మండలకేంద్రంలో శనివారం వివిధ గ్రామాల్లో కాంగ్రెస్, సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛందంగా వ్యాపారస్తులను తమ దుకాణాలను మూసివేశారు.

పాన్‌గల్: మండలంలో విద్యాసంస్థలు, వ్యాపారసంస్థలు మూసివేయడంతో బంద్ సంపూర్ణంగా జరిగింది. అన్ని పార్టీల, ప్రజాసంఘాల నాయకులు బంద్‌లో పాల్గొని మద్దతు ప్రకటించి నిరసన, ర్యాలీ నిర్వహించారు.

గోపాల్‌పేట: ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో ప్రశాంతంగా బీసీ బంద్ ముగిసింది. మద్దతు తెలిపినట్లుగానే అన్ని రాజకీయపార్టీలు బంద్‌లో పాల్గొన్నాయి. అనంతరం నిరసన, బైఠాయింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.

చిన్నంబావి: మండలంలో బీసీబంద్‌కు షాపులను, వాహనాలను నిలిపి తమ నిరసనను తెలిపారు. అన్ని పార్టీల ఆధ్వర్యంలో నిరసనలు, ర్యాలీ నిర్వహించారు.

ఖిల్లాఘనపురం: మండలంలో శనివారం చేపట్టిన బీసీ బంద్ ప్రశాంతంగా జరిగింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ పార్టీల నాయకులు వేరువేరుగా బస్టాండులో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలో షాపులు, నిరసనలు, ర్యాలీలో పాల్గొన్నారు.

కొత్తకోట: బీసీ రిజర్వేషన్‌పై బంద్ పిలుపు మేరకు అఖిలపక్షాల నాయకులు కలిసి మద్దతును ఇచ్చి బంద్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం కొత్తకోట చౌరస్తాలో అఖిల పక్ష నాయకులు, కార్యకర్తలు, బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొని నిరసన తెలిపారు.

వనపర్తి రూరల్: బీసీ బంద్‌కు వనపర్తి, శ్రీరంగాపురం, పెబ్బేరు మండలంలోని పట్టణ, గ్రామాల్లో స్వచ్ఛందంగా వ్యాపార సంస్థలు,నిత్యావసర షాపులను మూసివేసి బంద్‌ను పాటించారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్, సీపీఎం తదితర సంఘాల పాల్గొని నిరసన తెలిపారు.

మదనాపురం: మండలంలో బీసీ బంద్ విజయవంతం మైంది. అన్ని రాజకీయ పార్టీలు బందులు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా అన్ని పార్టీల నాయకులు పాల్గొని నిరసన తెలిపారు.

అమరచింత: మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన బీసీ బంద్ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. వామపక్ష పార్టీలతో పాటు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు ప్రధాన రహదారులపై వచ్చి వాహన రాకపోకలను నియంత్రించారు.

ఆత్మకూర్: మండలంలో బీసీ బంద్ విజయవంతంగా ముగిసింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ బీజేపీ, సీపీఎం, సీపీఐ తదితర పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపి ప్రధాన చౌరస్తాలో బైఠాయించారు.



నిర్మానుష్యంగా కొత్తకోట బస్టాండ్



కొత్తకోటలో మాట్లాడుతున్న నాయకులు



మదనాపురం సీపీఎం ఆధ్వర్యంలో..



పెబ్బేరులో పాల్గొన్న బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్



వనపర్తిలో పాల్గొన్న సీపీఎం, సీపీఐ నాయకులు



శ్రీరంగాపురంలో బంద్‌లో పాల్గొన్న నాయకులు



కొత్తకోటలో ప్రజలతో మాట్లాడుతున్న పోలీసులు



చిన్నంబావిలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



ఖిల్లాఘనపురం బస్టాండ్‌లో నిరసన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



ఖిల్లాఘనపురంలో బీజేపీ ఆధ్వర్యంలో నిరసన..



అమరచింతలో బంద్‌లో మాట్లాడుతున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్

ఘనంగా ధన్వంతరి జయంతి



ధన్వంతరి జయంతిలో పాల్గొన్న నాయీబ్రాహ్మణులు

ఖిల్లాఘనపురం: మండలకేంద్రంలో ప్రాచీన ఆయుర్వేదిక వైద్యుడు ధన్వంతరి జయంతి కార్యక్రమాలను శనివారం ఘనంగా నిర్వహించారు. మండల నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బజారు ఆంజనేయస్వామి ఆలయం ఈదమ్మదేవత గుడిమీదుగా వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. బస్టాండు దగ్గర ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంఘం గౌరవ అధ్యక్షుడు ఆశన్న, అధ్యక్షుడు శేఖర్, ఉపాధ్యక్షుడు నరసింహులు మాట్లాడుతూ.. ప్రాచీన కాలంలోనే ప్రజలకు ఆయుర్వేద వైద్యం అందించన వ్యక్తి ధన్వంతరి అన్నారు. కుల వృత్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి నాయిబ్రాంహ్మణుడిదన్నారు.ప్రభుత్వం తెలంగాణలోని ఆలయ పాలకమండలి కమిటీలో సభ్యులుగా అవకాశం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీలకు సన్మానించారు. కార్యక్రమంలో నరేందర్, మోహన్, హరిప్రసాద్, అంజనేయులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బంద్‌లో బీఆర్‌ఎస్, వామపక్షాల మధ్య వాగ్వాదం



అమరచింతలో సీఐ శివకుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు

- మాటలయుద్ధంతో తోపులాటలు
- పోలీసుల రంగప్రవేశంతో సద్దుమనిగింది..

అమరచింత: కలిసి కట్టుగా ఆందోళన చేద్దామంటే విడిగా ఆందోళన చేస్తూ తమ కూటమికి చెందిన జెండాల్లో మీ పార్టీ జెండాను ఎందుకు పెట్టారంటూ బీఆర్‌ఎస్ జెండాను తొలగించడంతో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. అమరచింత పట్టణంలో జరిగిన ఈ సంఘటనతో పట్టణ ప్రజలు ఉలిక్కి పడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వర్తింప చేయాలంటూ శనివారం నిర్వహించిన బంద్ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జేఏసీతో కలిసి ఆందోళనలో పాల్గొనక పోవడంతో వామపక్షాలు, బీఆర్‌ఎస్ నాయకులు వాగ్వాదానికి పాల్పడ్డారు. బంద్‌ను జయప్రదం చేయాలంటూ శుక్రవారం రాత్రి జేఏసీగా ఏర్పడిన సీపీఎం, సీపీఐ, మాస్‌లైన్, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు కలిసి షాపుల సముదాయలు మూసి ఉంచాలని యజమానులకు చెప్పడం జరిగింది. బంద్‌కు అన్ని పార్టీలు కలిసి ఆందోళనలో పాల్గొనాలని నిర్ణయించుకున్నారు. కాని బీఆర్‌ఎస్ నాయకులు మాత్రం మిగిలిన పార్టీల నాయకులతో కలిసి ఆందోళనలో పాల్గొనకుండా వేరుగా కార్యక్రమం చేస్తుండగా సామూహికంగా ఒకే చోట రహదారికి అడ్డంగా పెట్టిన పార్టీ జెండాల నుంచి బీఆర్‌ఎస్ జెండాలను వామపక్షాల పార్టీల నాయకులు తొలగించారు. దీంతో తమ జెండాలను ఎందుకు తొలగించారంటూ బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, నాగభూషణంగౌడ్ దురుసుగా మాట్లాడటంతో వామపక్షాల, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. ఒకరినొకరు తోసుకుంటూ చేయి చేసుకునే పరిస్థితి దాపరించడంతో ఇరువర్గాల మధ్య తీవ్రఘర్షణకు దారితీసింది. అప్పుడే అక్కడికి చేరుకున్న సీఐ శివకుమార్, ఎస్ఐ స్వాతి, నరేందర్‌లు తమ సిబ్బందితో కలిసి ఆందోళనకారులను శాంతింపచేశారు.

ఆర్థికసాయం అందజేత

బిజినేపల్లి: మండలంలోని లట్టుపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్ఎంఎంఎస్ పరీక్షల కోసం క్లాస్‌మెట్ క్లబ్ సభ్యులు స్టడీ మెటీరియల్స్ అందించారు. అదే విధంగా గ్రామానికి చెందిన విద్యార్థులు చరణ్, శ్రీకాంత్, విజయ్‌లకు రూ.30 ఆర్థికసాయం చేశారు. క్లాస్‌మెట్ ఫౌండర్ వాస రాఘవేందర్, సభ్యులు లక్ష్మి, నాగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, యాదగిరి, లక్ష్మణశర్మ, జెడ్పీహెచ్ఎస్ పాఠశాల హెచ్ఎం తిరుపతయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి మంత్రి పరామర్శ



రాంరెడ్డి పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పాన్‌గల్: మండలంలోని రేమద్దుల గ్రామ మాజీ సర్పంచ్ రాంరెడ్డి అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గ్రామానికి చేరుకొని మృతదేహనికి పూలమాల వేసి నివాళులర్పించి, మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మంత్రి వెంట మండల కాంగ్రెస్ నాయకులు గోవర్ధన్‌సాగర్, వెంకటేష్‌నాయుడు, మధుసూదన్ రెడ్డి, రవికుమార్, రాముయాదవ్, గోపాల్ రావు, భాస్కర్‌యాదవ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత



ఆర్థికసాయాన్ని అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి గ్రామానికి చెందిన బండపల్లికృష్ణయ్య కుటుంబానికి డీసీసీబీ చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి శనివారం రూ.5వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. బండపల్లికృష్ణయ్య గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలుసుకొని డీసీసీబీ చైర్మన్ గ్రామానికి చేరుకొని మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయాన్ని అందజేశారు. ఆయనవెంట గ్రామ కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

డేంజర్ మలుపులు



చెరువుకట్టపై ప్రమాదభరితంగా మలుపు



చెరువుకట్టపై శివారు రెండు మలుపులు ఇలా..

- నిత్యం ప్రమాదాలతో పలువురి మృత్యువాత
- చెరువుకట్ట వెడల్పు చేయాల్సిందే..
- స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

ఆత్మకూర్: ఆత్మకూర్ పట్టణ శివారులోని పరమేశ్వరస్వామి చెరువుకట్ట మలుపులు యమపురికి దారులుగా మారాయి. ఇది వరకే వందల సంఖ్యలో ప్రమాదాలు చోటుచేసుకోగా పదులసంఖ్యలో ప్రయాణికులు మృత్యువాతపడ్డారు. ఇక్కడి ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఈ విషయమై గతంలోనే 'సాక్షి' పలుమార్లు హెచ్చరించినా విషయాన్ని పాఠకులు గుర్తు చేస్తున్నారు. గతంలోనే బ్రిడ్జివద్ద అమరచింతకు చెందిన ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ మధ్యనే మదనాపురం చెందిన సుల్తాన్ ఇదే మలుపువద్ద టిప్పర్ ఢీ కొని మృత్యువాతపడ్డాడు. పదిమందికి పైగా మృతి చెందారు.

ప్రమాదకరంగా మలుపులు..

చెరువుకట్టపై ఆరు ప్రమాదకరమైన మలుపులు ఉండటంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. పరమేశ్వరస్వామి చెరువుకట్టను వెడల్పు చేయాలని గత కొన్నేళ్లుగా కోరుతున్న ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పెడచెవినా పెడుతున్నారు. చెరువుకట్ట కింద ఏర్పాటు చేసిన బ్రిడ్జి మలుపువద్ద చెట్లు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ఇది వరకు ఐదుగురు మృతి చెందారు. కొత్తకోట, చిన్నచింతకుంట, ఆత్మకూర్ వైపుగా వెళ్లే ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. కనీసం మలుపులవద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసిన ప్రమాదాలు తగ్గుతాయని ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చెరువుకట్టను వెడల్పు చేయాలని కోరుతున్నారు.

ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన కలిగి ఉండాలి



ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ రాంబాబు

కొత్తకోట: ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సీఐ రాంబాబు సూచించారు. శనివారం పట్టణ కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వాహనాలు నడిపేటప్పుడు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవడంతో పాటు, కార్ల డ్రైవర్లు సీట్‌బెల్ట్ ధరించాలన్నారు. మైనర్ల చేత వాహనాలు నడపడం, త్రిబుల్ రైడింగ్ చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ బి.ఆనంద్‌తో పాటు ఇతర సిబ్బంది తదితరులు ఉన్నారు.

ముందస్తుగా పాఠశాలలో దీపావళి



పాన్‌గల్ ప్రాథమిక పాఠశాలలో దీపావళిని నిర్వహిస్తున్న విద్యార్థులు

పాన్‌గల్: మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో దీపావళి ముందస్తు సంబరాలను శనివారం పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీపావళి ఆవశ్యకత, ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. సంబరాల్లో టపాసులు కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మ, ఉపాధ్యాయబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.